www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

సోమవారం | 24 | ఆగస్టు | 2026

పేజీలు : 8


## ఘనంగా ముత్యాలమ్మ బోనాలు



2 లో

# లేబర్ కోడ్‌లపై ఏఐటియుసి పోరుబాట

### మహాసభల సందర్భంగా సత్తుపల్లిలో హోరెత్తిన కార్మిక ప్రదర్శన




ప్రజాపక్షం/సత్తుపల్లిః కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ, కార్మికులకు రక్షణగా ఉన్న 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహా విమర్శించారు. ఖమ్మం జిల్లా 17వ మహాసభల సందర్భంగా ఆదివారం లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్లో జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీ నారాయణ అధ్యక్షతన జరిగిన సెమినార్ ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహా

మిగతా 2లో..

## ఖిల్లా రోప్ వేతో

# నూతన శోభ

### -వెయ్యేళ్ల చరిత్రకు నవశకం



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : వెయ్యేళ్ల ఘన చరిత్ర కలిగిన ఖమ్మం ఖిల్లా పర్యాటక రంగంలో సరికొత్త శోభను సంతరించుకోనుంది. ఉద్యమాల గడ్డ ఖమ్మం పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ కోట ఔన్నత్యాన్ని భావితరాలకు తెలియజేసేలా పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రోప్‌వే నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో స్థానిక ఎంఎల్‌ఎ, మంత్రి తుమ్మలనాగేశ్వరరావు ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. కాకతీయుల కాలంలో క్రీస్తు శకం 950లో పునాది పడిన ఖమ్మం కోట నిర్మాణం క్రీస్తు శకం 1006 నాటికి పూర్తయింది. నాలుగు చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో హిందూ, ఇస్లామిక్, బౌద్ధ శైలుల సమ్మేళనంగా వెలిసిన ఈ కోటకు 10 ద్వారాలు, 40 నుంచి 80 అడుగుల ఎత్తయిన గోడలు ఉన్నాయి. ఇందులో పట్టర్ దర్వాజ (సింహ ద్వారం ) అతిపెద్దది. నీటి అవసరాల కోసం 60 అడుగుల పొడువు, 20 అడుగుల వెడల్పుతో భారీ బావిని, వాచ్ టవర్లను, రాతి మెట్లను, సైనిక అవసరాల కోసం రహస్య సొరంగ మార్గాలను తీర్చిదిద్దారు. కాకతీయుల అనంతరం మునుసూరి నాయకులు, కుతుబ్‌షాహీలు, శ్రీకృష్ణదేవరాయులు,

మిగతా 2లో..

## కొణిజర్లలో సిఎంఆర్ బియ్యం మాయం..!





**-1700 టన్నుల బియ్యం నిల్వలు గల్లంతైనట్లు సమాచారం**

**-రూ.4కోట్ల మేర ప్రభుత్వానికి నష్టం..?**

**-మిల్లర్‌పై కేసు నమోదు**

**-జిల్లాలో 12 మిల్లుల్లో తనిఖీలు**

ప్రజాపక్షం/కొణిజర్ల : ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో సిఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) ధాన్యం వ్యవహారంలో భారీ అక్రమాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. వరంగల్ విజిలెన్స్ అధికారులు, సివిల్ సప్లై అధికారులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో సుమారు 1700 టన్నుల బియ్యం నిల్వల్లో తేడా గుర్తించినట్లు తెలుస్తుంది. దీని విలువ సుమారు రూ.4కోట్ల మేర ఉంటుందని అధికారులు అంచనా వేసినట్లు సమాచారం. తెలంగాణ ప్రభుత్వం సిఎంఆర్ ధాన్యం తీసుకున్న మిల్లులపై ప్రత్యేక దృష్టి సారించి

మిగతా 2లో..

# బోనాల పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక



**-ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలి**

**-ప్రకృతిని ఆరాధించే విశిష్ట పండుగ బోనాలు**

**-భక్తిభావం, ఐక్యతను పెంపొందించే వేడుక**

**- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని**

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అని, ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. లక్ష్మీదేవిపల్లి పరిధిలోని సింగరేణి బంగ్లోస్ గేటు సమీపంలో వెలసిన శ్రీ పోచమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం శ్రావణమాస బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు శ్రావణ బోనాల శుభాకాంక్షలు తెలిపారు.

మిగతా 2లో..

# లేబర్ కోడ్‌లపై ఏఐటియుసి పోరుబాట






(మొదటిపేజీ తరువాయి)
ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహాసభల సందర్భంగా అంబేద్కర్ సెంటర్ నుండి మహాసభల ప్రాంగణం వరకు బారీ కార్మిక ప్రదర్శనను నిర్వహించారు. అనంతరం లక్ష్మి ప్రసన్నలో జరిగిన సదస్సులోనరసింహ మాట్లాడుతూ అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం దాసోహం చేస్తుందని ఆరోపించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన చట్టాలు తీసుకురావడంతో శ్రామికుల శ్రమ మరింత దోపిడికి గురవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనధికారికంగా రోజుకి 10 నుండి 16 గంటలు పని చేయించుకుంటున్నారని, రేపు ఎనిమిది గంటల పని విధానాన్ని తొలగిస్తే కార్మికుల జీవితాలు బుగ్గిపాలవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వాలు కార్మికులకు ఏ చట్టాన్ని దయతోనో వారి సంక్షేమం కొరకు ఇవ్వలేదని కార్మిక చట్టాలు కేవలం కార్మికులు దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించిన హక్కులన్నారు. కాంట్రాక్ట్ ,ఔట్సోర్సింగ్ విధానాల వల్ల ప్రస్తుతం సంఘటిత రంగంలో కూడా అసంఘటి తరంగాన్ని తలపించేలా వేతనాలు ఉన్నాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉద్యోగ భద్రత, పని గంటలు, వేతనాలు, సామాజిక భద్రత వంటి అంశాలపై లేబర్ కోడ్‌లు ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు తాము కనీస వేతనాలు నెలకు రూ. 26 వేలు ఇవ్వాలని పోరాటాలు చేస్తుంటే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేతనాలు తగ్గించడం విడ్డూరంగా ఉందన్నారు. ఒకవైపు బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతూనే మరొకవైపు ఎనిమిది గంటల పని విధానాన్ని తొలగించి 10 గంటల పని విధానం తీసుకురావటం బాధాకరమైన విషయమని మండిపడ్డారు. సోమవారం జరిగే మహసభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, జాతీయ కౌన్సిల్ సభ్యులు బాగం హేమంతరావు, పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షేక్ షాబీర్ పాషా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొంటారని కావునా సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు బారీగా హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగ్ నరసింహారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.జి. క్లైమెంట్, జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ శివరామకృష్ణ, జిల్లా కార్యదర్శి టి. రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షురాలు సీతామహాలక్ష్మి , వేము రాంబాబు, మహాదేవ లక్ష్మి , జిల్లా కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, బి.కే.ఏం.యు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ, సింగరేణి ఏఐటీయూసీ కార్యదర్శి సముద్రాల సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు తడికమళ్ల యోబు, రంజాన్ బీ, మున్సిపల్ నాయకులు ఊడల కృష్ణమూర్తి, వజీర్ మియా, టి. లక్ష్మి , సత్తుపల్లి, సుధాకర్, కార్యదర్శి శ్రీనివాసరావు, మలైకా, ఏఐటీయూసీ మండల కార్యదర్శి రామారావు తెలగారపు, తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులు కంచి శ్రీను, నాయకులు వల్లెపు శ్రీను, పోలేటి వెంకటేశ్వరరావు, వేంసూరు ఎండీఎం అధ్యక్షురాలు మిట్టపల్లి సత్యావతి, పిల్లి బుచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

# కొణిజర్లలో సిఎంఆర్ బియ్యం మాయం..!







(మొదటిపేజీ తరువాయి) తనిఖీలు ముమ్మరం చేసిది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లాలో ప్రత్యేక విజిలెన్స్ బృందాలు వరుసగా మిల్లులను తనిఖీ చేస్తున్నాయి. కొణిజర్ల పట్టణంలోని రైస్ మిల్లులో ప్రభుత్వం కేటాయించిన ధాన్యం దానికి అనుగుణంగా ప్రభుత్వానికి తిరిగి అందించాల్సిన బియ్యం పరిణామాల మధ్య భారీ వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. సుమారు 1700 టన్నుల బియ్యం లెక్కలు తేలకపోవడంతో ప్రభుత్వానికి సుమారు రూ.4కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలుస్తుంది. తనిఖీల అనంతరం మిల్లు నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. సిఎంఆర్ ధాన్యం నిల్వలు, బియ్యం ఉత్పత్తి, ప్రభుత్వానికి తిరిగి అందించిన పరిణామాలపై అధికారులు పూర్తిస్థాయిలో రికార్డులను పరిశీలిస్తున్నట్లు తెలుస్తుంది.

**ఖమ్మం జిల్లాలో తనిఖీలు ముమ్మరం...**

ఇప్పటివరకు ఖమ్మం జిల్లాలో సుమారు 12 రైస్‌మిల్లులపై విజిలెన్స్, సివిల్‌స‌పై అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. సిఎంఆర్ ధాన్యం విషయంలో ఎక్కడైనా అక్రమాలు, నిల్వల్లో తేడాలు ఉన్నాయా అనే అంశంపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. కొణిజర్లతో పాటు ఇటీవలే తల్లాడలో వెలుగుచూసిన ఈ వ్యవహారం జిల్లాలోని ఇతర మిల్లర్లలోను చర్చనీయాంశంగా మారింది. రానున్న రోఉల్లో మరిన్ని మిల్లులపై తనిఖీలు జరిగే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతుంది.

# స్వీయ రక్షణే శ్రీరామరక్ష

**-పరిసరాల పరిశుభ్రతే ప్రధానం..**
**-చుంచుపల్లి లో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు**

**ప్రజాపక్షం/చుంచుపల్లి:** మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరం చేశారు. గ్రామాల్లో చెత్తాచెదారం తొలగింపు, మురుగు కాలువల శుభ్రత, నిల్వ నీటి తొలగింపు వంటి పనులను చేపడుతున్నారు. ముఖ్యంగా వర్షాల నేపథ్యంలో ఎక్కడైనా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నారు. అపరిశుభ్రత కారణంగా దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**ప్రజల సహకారం అవసరం...**

ప్రతి కుటుంబం తమ ఇంటిని మాత్రమే కాకుండా ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. చెత్తను రోడ్లపై, కాలువల్లో వేయకుండా పారిశుధ్య సిబ్బందికి అప్పగించాలని కోరారు. అలాగే ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కాలువల్లో చెత్త వేకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు సామూహిక పారిశుధ్యాన్ని పాటించడం ద్వారా అనేక వ్యాధులను ముందుగానే నివారించవచ్చని తెలిపారు.

**వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు...**

పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని కోరుతున్నారు. "స్వీయరక్షణే శ్రీరామరక్ష పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్ష" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులు పిలుపునిచ్చారు.

# ఖిల్లా రోప్ వేతో నూతన శోభ

(మొదటిపేజీ తరువాయి) అసఫ్ జాహీలు ఈ కోటను పాలించారు. 1948లో ఇది భారత యూనియన్‌లో విలీనమైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పాలేరు నుంచి భద్రాచలం పర్ణశాల వరకు పర్యాటక అభివృద్ధిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెరగని ముద్ర వేశారు. ఖమ్మం శాసన సభ్యునిగా ఎన్నికై మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించారు. ఖమ్మం ఖిల్లాను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు రోప్‌వే ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఈ రోప్‌వే నిర్మాణం పూర్తయితే ఖమ్మం నగరానికి సరికొత్త ఐకాన్‌గా మారనుంది. ఖిల్లాను సందర్శించే స్థానికులతో పాటు పర్యాటకులకు ఈ రోప్‌వే ప్రయాణం సరికొత్త అనుభూతిని, ఉత్సాహాన్ని అందిస్తుందని పర్యాటక ప్రియులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రోప్‌వే నిర్మాణంపై నిరంతరం సమీక్షిస్తూ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

# ఘనంగా ముత్యాలమ్మ బోనాలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గంగపుత్ర సంఘం జూబ్లీపుర సారధినగర్ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆనవాయితీ, సాంప్రదాయాలను పాటిస్తూ భక్తి శ్రద్దలతో బోనాల వేడుకను నిర్వహించారు. మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి నెత్తిన బోనమెత్తుకుని మేళ తాళాలు, డప్పు చప్పుళ్లతో పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ముత్యాలమ్మ తల్లిని దర్శించుకుని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించి భక్తి శ్రద్దలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబంతో పాటు ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ వేడుకల్లో మహిళలు, యువత, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గంగపుత్రుల సంఘం జూబ్లీపుర సారధినగర్ అధ్యక్షులు కన్నం రమేష్, ప్రధాన కార్యదర్శి గోధుమల శ్రీనివాసరావు, కోశాధికారి సోమనబోయిన కుమార్, జిల్లా అధ్యక్షులు కన్నం ప్రసన్నకృష్ణ, నగర అధ్యక్షులు చేతి కృష్ణ, మాజీ కార్పొరేటర్ కన్నం వైష్ణవి, వంగాల వెంకట్, సింగం అంజయ్య, గోధుమల ఉపేందర్, కన్నం రాజేందర్, వడ్డెబోయిన భిక్షపతి, చేతి శ్రీనివాస్, కన్నం రవీందర్, పూజారి రాజు తదితరులు పాల్గొన్నారు.

# బోనాల పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక



(మొదటిపేజీ తరువాయి)
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడే గొప్ప సంప్రదాయం మన పండుగల్లో దాగి ఉందని పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాలు సుభిక్షంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగుండాలని కోరుతూ భక్తిశ్రద్ధలతో ప్రజలు అమ్మవార్లను కొలవడం మన ఆచారమన్నారు. ఇలాంటి ఉత్సవాలు సమాజంలో సోదరభావం, ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన వివరించారు. పోచమ్మ తల్లి చల్లని దీవెనలతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలు, శాంతిసౌభాగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా, కొత్తగూడెం మున్సిపల్ మేయర్ మూడ్ గణేష్, ఆలయ ధర్మకర్త రాజ్య తదితరులు పాల్గొన్నారు.

# సాంబశివరెడ్డికి పలువురు నివాళి






**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నిర్మల్ హృదయ్ స్కూల్ అధినేత వంగా సాంబశివరెడ్డి మృతిపట్ల పలువురు నివాళులర్పించారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన సాంబశివరెడ్డి దశ దిన కర్మ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, వివిధ పార్టీల నాయకులు, విద్యా సంస్థల బాధ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. విద్యా రంగంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, చింతల రమేష్ సాంబశివరెడ్డికి నివాళులర్పించారు.

# ఎంఆర్‌పీఎస్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిధిలోని కట్టకూరు ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నిర్వాహకులు గ్రామ కమిటీ వివరాలను పేర్కొన్నారు. కట్టకూరు గ్రామ ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడిగా కొత్తపల్లి హుస్సేన్ మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకుని పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ మండల ఎంఎస్‌పీ మాజీ అధ్యక్షుడు, కోఇంఛార్జి పడిశాల నాగేశ్వరరావు, మండల బాధ్యులు బొడ్డు వెంకటేశ్వర్లు మాదిగ, ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు కొత్తపల్లి బాబు, మాతంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# 25న సర్పంచుల చైతన్య సదస్సు




**-సర్పంచుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి**
**-పంచాయతీరాజ్ ఛాంబర్స్ గౌరవ అధ్యక్షులు నరేందర్**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఈనెల 25న ఖమ్మంలో జరిగే తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ ఖమ్మం జిల్లా సర్పంచుల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్స్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పుసులూరి నరేందర్ పిలుపునిచ్చారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరేందర్ మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే తొలుత గ్రామాలు అభివృద్ధి చెందాలన్నారు. గ్రామాలు శక్తివంతంగా, స్వచ్ఛంగా, పచ్చదనంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. స్థానిక సంస్థల గ్రామ పాలన రోజు రోజుకు దిగజారిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గాంధీజీ కన్న కలలను నిజం చేసేందుకు గ్రామాలను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అందుకు అవసరమైన నిధుల కేటాయింపు జరగాలన్నారు. చెక్‌పవర్ గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శికి ఉండాలని, 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా 243జి ఆర్టికల్‌లోని 11వ షెడ్యూల్‌లో పొందుపర్చిన 29 అంశాలను పంచాయతీలకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో 50 శాతం నిధులను గ్రామపంచాయతీలకు ఇవ్వాలని కోరారు. కేంద్ర నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన రిజిస్ట్రేషన్లు, మైనింగ్ రాయల్టీ, ట్యాక్స్‌లు, ఇతర రాబడులు గ్రామ పంచాయతీలకు వెంటనే విడుదల చేయాలన్నారు. సర్పంచుల గౌరవ వేతనం రూ. 30వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ లేక్‌వ్యూ క్లబ్‌లో జరిగే సర్పంచుల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని కోరారు.ఈ సమావేశంలో జెడ్పిటిసిల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు బెల్లం శ్రీనివాస్, ఎంపిపిల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లోడిగ వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

# అబద్ధపు హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్




**-ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అభివృద్ధి శూన్యం**
**-జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి గడల శ్రీనివాసరావు**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ పార్టీ అనేక అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి గడల శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లా జనసేన డిజిటల్ మీడియా సమ్మేళనం నిర్వహించారు. జనసేన పార్టీ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జనసేనను క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు 101 మందితో జనసేన సోషల్ మీడియా సైన్యాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా జనసేన ఆవిర్భవించిందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు కీలక శాఖలకు ప్రాతినిథ్యం వహిస్తున్నప్పటికీ అభివృద్ధి మాత్రం శూన్యమన్నారు. మంత్రుల మధ్య సమన్వయం లేదని ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. సీతారామ ప్రాజెక్టుపరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. ప్రాజెక్టులలో నీళ్ల లేక పోగా నిర్మించిన నిర్మాణాలు కొట్టుకుపోతున్నాయన్నారు.

**ఎంఎల్‌సి అభ్యర్థిగా గడల శ్రీనివాసరావు : తాళ్లూరి రామ్**

ఖమ్మం. నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా గడల శ్రీనివాసరావు పోటీ చేయనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ తెలిపారు. పార్టీ నాయకుల అందరి సమిష్టి నిర్ణయంతో గడల శ్రీనివాసరావును ఎంపిక చేసినట్లు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల (జెడ్పిటిసి, ఎంపిటిసి) ఎన్నికలతో పాటు పార్టీని సంస్థాగతంగా ఎలా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. ఖమ్మం నగర పాలక సంస్థలో జనసేన పార్టీ మద్దతు లేకుండా ఏ పార్టీ మేయర్ పీఠాన్ని దక్కించుకోలేదని ఆయన తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 13న ఆదివారం ఖమ్మం ఎంబి గార్డెన్స్‌లో నిర్వహించే జనసేన శంఖారావం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు మిరియాల రామకృష్ణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులు

**ప్రజాపక్షం/బోనకల్‌:** చిన్ననాటి స్నేహానికి ప్రతీకగా 1992, 93 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ స్నేహితులు మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన కొట్టెదాసు వారం రోజుల క్రితం మృతి చెందగా, అతని స్నేహితులు కుటుంబానికి అండగా నిలిచారు. ఆదివారం దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌సి బ్యాచ్‌కు చెందిన స్నేహితులు కలిసి రూ.18,300 వేలు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మిత్రుడిని కోల్పోయిన కుటుంబానికి ఈ కష్ట కాలంలో తమ వంతు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. చిన్ననాటి నుంచి కొనసాగుతున్న స్నేహబంధాన్ని మరణానంతరం కూడా కొనసాగిస్తూ, ఆపదలో ఉన్న మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడం పట్ల పులువురు అభినందిస్తున్నారు. స్నేహితులు చేపట్టిన ఈ మానవతా కార్యక్రమాన్ని గ్రామస్తులు అభినందించారు. కష్టసమయంలో తోటి మిత్రుడి కుటుంబానికి అండగా నిలవడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. చిన్ననాటి స్నేహితులు తమ మిత్రుడి కుటుంబాన్ని ఆదుకోవడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 1992, 93 ఎస్ఎస్‌సి బ్యాచ్‌వకు చెందిన పలువురు స్నేహితులు పాల్గొన్నారు.



# సంక్షేమ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/మధిర:** స్థానిక మధిర పట్టణంలోని బిసి, ఎస్సీ హాస్టల్స్‌ను ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ సందర్శించి విద్యార్థులతో మాట్లాడి హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు తెలుసుకొని అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సంక్షేమ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను చేయాలని, హాస్టల్‌లో పరుపులు, బెడ్లు లేకపోవడం వలన విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, కిటికీలు సరైన జాలీలు లేక దోమలు పెరిగి విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని, అలాగే శిథిలావస్థలో ఉన్న హాస్టల్‌కు నూతన భవనాలను నిర్మించాలని విద్యార్థులకు సరిపడా టాయిలెట్స్ నిర్మించాలని, మధిర పట్టణంలోని బిసి బాయ్స్, బాలికల కళాశాల హాస్టల్‌కు, రెగ్యులర్ వార్డెన్‌లు లేకపోవడం వలన పర్యవేక్షణ కరువైందని తక్షణమే హాస్టల్స్ సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎఫ్ మధిర మండలం నాయకులు అశోక్, అక్బర్, జస్వంత్, శశివర్ధన్, సాయి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# సింహాద్రినగర్‌లో సీసీరోడ్డు పనులకు శ్రీకారం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ 32వ వార్డుల పరిధిలోని సింహాద్రినగర్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులకు 32వ వార్డు సిపిఐ కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి ఆదివారం శీకారం చుట్టారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. ఏర్పాటు చేస్తున్న సిసిరోడ్డుతో కాలనీ ప్రజలకు రాకపోకల్లో మరింత సౌకర్య కలుగుతుందన్నారు. మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 28వ వార్డు సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు, భారత కమ్యూనిస్టు పార్టీ 32వ వార్డు కార్యదర్శి మామిడి సుదర్శన్‌రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గణపారపు ఉపేందర్, ఉపాధ్యక్షుడు మామిడాల కిరణ్, యువజన సంఘం నాయకులు పొన్నం ఉమేష్, కాలనీ వాసులు నిమ్మకంటి యుగంధర్, వల్లోజి సత్యనారాయణ, రావెళ్ల అశోక్, రాజగోపాల్‌రెడ్డి, ధరణబోయిన వెంకటేశ్వర్లు, కటకం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# 29వ వార్డులో ఘనంగా ముత్యాలమ్మ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని 29వ వార్డులో కౌన్సిలర్ వెంపటి ఉమా ఆధ్వర్యంలో ముత్యాలమ్మ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకుని వచ్చి 28వ వార్డులోని ముత్యాలమ్మ తల్లికి సమర్పించి, తీర్థ ప్రసాదాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా పురుషులు అమ్మ వారికి సాంప్రదాయమైన జంతుబలిని చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు వెంపటి సుధాకర్, వెంపటి కోటయ్య, వెంపటి రవి, మెడికల్స్ వెంకటేశ్వర్లు, పొన్నం రాము, చిదుముల ప్రసాద్‌రెడ్డి, యువకులు, మహిళా భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మోతారపు లచ్చమ్మకు సిపిఐ నివాళి



**ప్రజాపక్షం/చింతకాని :** ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన మోతారపు లచ్చమ్మ దశదిన కర్మ ఆదివారం ప్రొద్దుటూరు గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శిదండి సురేష్ హాజరై లచ్చమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారి లో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లిఖార్జునరావు, పార్టీ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు నాయకులు తాళ్లూరి యాదగిరి, తుపాకుల సైదులు, కొత్తపల్లి రమేష్, నంబూరి శంకరరావు కాంగ్రెస్ నాయకులు కూరపాటి కిషోర్ , మాజీ సర్పంచ్ పెంట్యాల పుల్లయ్య , టీడీపీ నాయకులు పెంట్యాల రామారావు, బారాస నాయకులు పాపినేని రంగారావు, గడ్డం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# జిమ్నాస్టిక్స్‌లో మనుశ్రీ ప్రతిభ



**ప్రజాపక్షం/చింతకాని :** జిల్లా స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో చింతకాని మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన గంటెల మనుశ్రీ అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. మనుశ్రీ తండ్రి గంటెల ఈశ్వరరావు చిన్ననాటి నుంచి తన కుమార్తెను జిమ్నాస్టిక్స్‌లో ప్రోత్సహించడం, నిరంతరం సాధన బహుమతిని ప్రధాన కారణమని కుటుంబసభ్యులు తెలిపారు. మనుశ్రీ భవిష్యత్తులో మరింత కష్టపడి సాధన చేసి రాష్ట్ర , జాతీయ స్థాయిలో రాణించాలని గ్రామస్థులు ఆకాంక్షిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మనుశ్రీని అభినందించారు.

# డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన



**ప్రజాపక్షం/మధిర:** మధిర మున్సిపాలిటీ పరిధిలోని ఎంప్లాయిస్ కాలనీ ఎస్సీ కాలేజ్ బాయ్స్ హాస్టల్‌లో వెల్ఫేర్ ఆఫీసర్ జి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన హాస్టల్ విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ వాడటం వలన కలిగే దుష్ప్రభావాలు, ఫోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టౌన్ ఎస్సై కిషోర్‌కుమార్ పాల్గొన్నారు. అతిథులుగా ఏఎస్సైడివో మధిర డివిజన్ అధికారి ఏ.గోపిచంద్‌నాయక్, జూనియర్ కాలేజీ లెక్చరర్ కొండలరావు పాల్గొన్నారు. ఎస్సై కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ఫోక్సో చట్టంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, ఫోక్సో చట్టం విధి విధానాలను వివరించారు. డ్రగ్స్ వాడటం వలన కలిగే నష్టాలను వివరించారు. డ్రగ్స్ వాడటం వలన జీవితాలు నాశనం అవుతాయని తెలిపారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరిగిపోయాయని సైబర్ నేరాలు విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. హాస్టల్ వసతులు ఉపయోగించుకొని విద్యార్థులు బాగా చదువుకోవాలని, భవిష్యత్తులో ఉన్నత స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటికి గృహ ప్రవేశం

**-ప్రారంభించిన ఎంఎల్‌ఏ కోరం కనకయ్య**



**ప్రజాపక్షం/ఇల్లందు:** ముత్యాలంపాడు ఎక్స్‌రోడ్డు గ్రామ పంచాయితీ పరిధిలోని గొర్యాతండాలో లబ్దిదారు అశోక్ నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటిని ఇల్లందు ఎంఎల్‌ఏ కోరం కనకయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బానోత్ పూలబంతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్కినేని శ్యామ్, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాద్‌తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ



**ప్రజాపక్షం/ఇల్లందు:** సింగరేణిలో విధులు నిర్వహిస్తూ మైన్ ప్రమాదంలో 16ఏళ్ల క్రితం మృతి చెందిన పెరుగు కోటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఆదివారం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. వైద్యుడు శైలేష్ చేతుల మీదుగా రోగులకు వీటిని అందజేశారు. కోటేశ్వరరావు భార్య పద్మ, కుమారుడు రవీంద్ర, భాస్కరరావు మాట్లాడుతూ తండ్రి జ్ఞాపకార్థం ప్రతి ఏడాది సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో కుటుంబ సభ్యులు సుజాత, ఉమాశంకర్, రాజ్యలక్ష్మి, రజితతో పాటు మనుమలు, మనుమరాళ్లు, బంధువులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారంలో కాలయాపన వద్దు



**ప్రజాపక్షం/ములకలపల్లి:** భూభారతి పేరుతో భూ సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి వూకంటి రవికుమార్ విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతు సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను వెంటనే పరిశీలించి అర్హులైన రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని కోరారు. సాగులో ఉన్న ప్రతి రైతుకు భూమిపై హక్కు కల్పించేలా చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎరువుల కొనుగోలు యాప్‌లను రద్దు చేసి గతంలో మాదిరిగా ఎరువులు అందుబాటులోకి తేవాలని, రైతులకు 24గంటల విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఈసమావేశంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు గోపగాని లక్ష్మీ నరసయ్య, నాయకులు గద్దం వెంకటేశ్వర్లు, భూక్య శ్రీదేవి, వైరు ప్రసాద్, కొరసా వెంకటేశ్వర్లు, పెంకె భద్రయ్య, కంపసాటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో కుల వివక్షతకు తావివ్వొద్దు



**ప్రజాపక్షం/గుండాల :** ఏకలవ్య పాఠశాలలో విద్యార్థుల్లో కుల వివక్షతకు తావు ఇవ్వకుండా ఉపాధ్యాయులు ప్రత్యేకదృష్టిని సారించాలని కాంగ్రెస్ పార్టీ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే ఖదీర్ ఉపాధ్యాయులకు , విద్యార్థులకు సూచించారు. ఆదివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్ల ఆదేశాలమేరకు పాఠశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్స్‌పాల్ తో జరిగిన సంఘటనపై వివరాలను తెలుసుకొని, సుదూర ప్రాంతాలనుండి విద్యను అభ్యసించడానికి వచ్చిన విద్యార్థుల భౌషత్ న్ తీర్చి దిద్దాల్సిన బాధ్యత గురువుల పైన ఎంతైన ఉందని అన్నారు. దేవాలయంలాంటి విద్యాలయంలో విద్యార్థుల నడుమ కుల వివక్షతకు దారితీయడం చాల విచారకరమని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉపాధ్యాయులు,సిబ్బంది తగుజాగ్రతలను పాటించాలని వారికి సూచించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి పలు సలహాలు సూచనలు చేసి, బోజన వసతులను పరిశీలించి విద్యార్థులతో కలసి బోజనంచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టి మండల కార్యదర్శి వాగబోయిన రమేష్, గద్దం శ్రీను, పుష్పరాజు, ఎస్కె ఖాసీం, వాజీద్, రాజేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద వైద్యానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/గుండాల :** మోటార్ సైకిల్ ప్రమాదంలో గాయపడిన మండల పరిదిలోని వెన్నెల బైలు గ్రామానికి చెందిన ఇర్ప రాజేష్ ఆర్థిక పరిస్థితిని గుర్తించి శెంభునిగూడెం సర్పంచి సుమలత వైద్యం నిమిత్తం తన స్తోమతకు తగిన ఆర్థిక సహాయాన్ని అందించి తన మావతను చాటుకున్నారు. రాజేష్ గత మూడునెలలక్రితం ప్రమాదం జరిగి వైద్యకోసం అప్పులు చేసి సుమారు పది లక్షల వరకు వెచ్చించిన పరిస్తితి మెరుగు పడక పోవడంతో ఇంటివద్దనే ఉండడాన్ని గుర్తించి చికిత్సకోసం ఆ ర్థిక సహాయం చేసినట్లు తెలిపారు. ఈ సందర్బంగా వాహనాల ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రతలను పాటించాలని ఈ సందర్బంగా సూచించారు. ఈ సందర్బంలో సర్పంచి భర్త రాజబాబు, ఉపసర్పంచిక్రిష్ణయ్య, వార్డు సభ్యులు సమ్మయ్య, బుచ్చయ్య, వసంతరావు, సుమలత, రవి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఆసరా ఆశలు.. రాతల సవాలు..!

**-కాగితాల మెలికలో చిక్కుకున్న ఒంటరి మహిళలు, వృద్ధుల బతుకులు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** కూలీ పని చేసుకుంటేనే గానీ కడుపు నిండని పేద బతుకులు, వయోభారంతో నడవలేని స్థితిలో ప్రభుత్వ చేయూత కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు, భర్తలకు దూరమై సమాజంలో ఒంటరిగా పోరాడుతున్న మహిళలు...! వీరందరికీ ప్రభుత్వం అందించే ఆసరా పింఛన్ కొండంత ధైర్యాన్ని ఇవ్వాలి. కానీ, నిబంధనలపై స్పష్టత లేకపోవడం, పత్రాల పేరుతో జరుగుతున్న జాప్యం అర్హులైన పేదలకు ఇబ్బందిగా మారుతోంది. విడాకుల పత్రాల పేరుతో ఒంటరి మహిళలను, విచారణల పేరుతో వృద్ధులను కార్యాలయాల చుట్టూ తిప్పుతూ కాలయాపన చేస్తుండటంతో ఆసరా కాస్తా ఆవేదన గా మారుతోంది.

### విడాకుల పత్రాల మెలిక.. ఒంటరి మహిళల అష్టకష్టాలు

గ్రామీణ ప్రాంతాల్లోని సాంప్రదాయాలు, సామాజిక పరిస్థితుల నేపథ్యంలో కుటుంబ పెద్దలు, గ్రామ పెద్దమనుషుల సమక్షంలో లేదా కుల పంచాయితీల్లో ఇరువర్గాల అంగీకారంతో విడాకులు తీసుకుని వేరుగా ఉంటున్న ఒంటరి మహిళలు మండలంలో వందలాది మంది ఉన్నారు. వీరు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా, అధికారులు కోర్టు ద్వారా పొందిన విడాకుల పత్రం ఉంటేనే దరఖాస్తులు స్వీకరిస్తామని స్పష్టం చేస్తున్నారని బాధితులు పేర్కొంటున్నారు. రోజువారీ కూలీ పనులు చేసుకునే మహిళలకు కోర్టుల చుట్టూ తిరిగే ఆర్థిక స్థోమత, సమయం ఎక్కడుంటాయని వారు ప్రశ్నిస్తున్నారు. గ్రామస్థాయిలో సంబంధిత సిబ్బంది ద్వారా క్షేత్రస్థాయి విచారణ జరిపి అర్హతను నిర్ధారించే అవకాశం ఉన్నప్పటికీ, పత్రాల పేరుతో దరఖాస్తులను తిరస్కరించడం సరికాదని బాధితులు వాపోతున్నారు.

### వృద్ధులకు నిరాశే మిగిల్చిన చేయూత

వృద్ధాప్య పింఛన్ల విషయంలోనూ మండలంలో తీవ్ర జాప్యం జరుగుతోందని పలువురు వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 57 ఏళ్లు దాటిన వృద్ధులు ఏళ్ల తరబడి దరఖాస్తులు చేసుకుని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం ఉండటం లేదని చెబుతున్నారు. సచివాలయాల ద్వారా సక్రమంగా నమోదు కాకపోవడం, పోస్టాఫీసులు, బ్యాంకుల చుట్టూ తిప్పించుకోవడంతో వయోవృద్ధులు శారీరకంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాంకేతిక కారణాలు, కాగితాల సాకులు చూపి అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలను దూరం చేయడం సరికాదని మండల ప్రజలు అంటున్నారు. మండలంలో నెలకొన్న పింఛన్ల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రత్యేక విచారణ చేపట్టి, అర్హులైన బాధితులందరికీ ఆసరా పింఛన్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

### కోర్టు పత్రం ఎక్కడి నుంచి తేవాలి..?: ప్రమీల, భైరవునిపల్లి.

"నేను ఐదేళ్ల క్రితం గ్రామ పెద్దమనుషుల సమక్షంలో నా భర్త నుంచి విడాకులు పొంది అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్నాను. కుటుంబ పోషణ భారంగా మారింది. పింఛన్ కోసం కార్యాలయానికి వెళ్తే కోర్టు నుంచి విడాకుల పత్రం కావాలని అడుగుతున్నారు. నేను ఎక్కడి నుంచి తీసుకురావాలి? నా పరిస్థితిని అధికారులు అర్థం చేసుకుని న్యాయం చేయాలి.

### సడలింపు ఇవ్వాలి : రాసాల నవీన్ ఉపసర్పంచ్, రాజేశ్వరపురం



కోర్టు విడాకుల పత్రాల నిబంధనను సడలించి, గ్రామ పంచాయతీ అగ్రిమెంట్, క్షేత్రస్థాయి విచారణ ఆధారంగా ఒంటరి మహిళలకు పింఛన్లు మంజూరు చేయాలి. మండల కార్యాలయంలో పింఛన్లకు సంబంధించిన సందేహాల నివృత్తి, కొత్త దరఖాస్తులకు మార్గదర్శకత్వం కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి. పింఛన్ దరఖాస్తు తిరస్కరణకు గురైనప్పుడు అందుకు గల స్పష్టమైన కారణాలను దరఖాస్తుదారులకు రాతపూర్వకంగా తెలియజేయాలి. మండలంలోని ప్రతి గ్రామంలో పింఛన్ దరఖాస్తుల పరిశీలన కోసం ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలి.

# అధ్వానంగా ఆటో డ్రైవర్ల జీవితాలు..!

**-ఆర్థిక ఇబ్బందుల్లో ఆటో డ్రైవర్లు**
**-ఆటో డ్రైవర్లను ప్రభుత్వ ఆదుకోవాలని ఏఐటియుసి డిమాండ్**





**ప్రజాపక్షం/సుజాతనగర్:** ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ల జీవితాలు కొట్టుమిట్టాడుతున్నాయి. ఉదయం నుండి రాత్రి వరకు 500 నుండి 600 రూపాయల వరకు సంపాదించడం కష్టంగా మారిందిజ ఎంతో మంది యువకులు డిగ్రీలు చదివి ఏ ఉద్యోగం దొరక్క ఆటో డ్రైవర్ గా జీవనం కొనసాగిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వేల సంఖ్యలో ప్రతిరోజు ఆటోలు నడుస్తున్నాయి. పిల్లల చదువులు, ఆసుపత్రి ఖర్చులు, పెరిగిన నిత్యవసర సరుకులు ధరలు, ఇంటి అద్దె భరిస్తూ వచ్చిన ఆదాయం సరిపోక అప్పుల్లో ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు. పెరిగిన డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు, ఆటో విడిభాగాల రేట్లు, ఇన్సూరెన్స్ ధరలు, కొత్త ఆటోలపై పెంచిన ధరలతో ఆటో డ్రైవర్ చితికి పోతున్నాడు. గత పది సంవత్సరాల కాలంలో చూసుకుంటే ఆదాయ మాత్రం అంతే ఉంది ఖర్చు మాత్రం పదిరెట్లు పెరిగింది. చాలామంది ఆటో అద్దెకు తీసుకువచ్చి వచ్చిన 500 రూపాయలు 250 రూపాయలు ఓనర్ కి ఇచ్చి మిగిలిన 250 తో ఆటో డ్రైవర్ జీవనం సాగిస్తున్నారు. ఈ రోజుల్లో రోజంతా కష్టపడితే వచ్చే 250 కుటుంబం గడపడం చాలా కష్టంగా మారుతుంది. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం తీసుకోవచ్చి ఉచిత బస్సులు నడపడం వలన ఉన్న కాస్త కిరాయిలు కూడా తమకు దక్కడం లేదని ఆటో డ్రైవర్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిరాయిలు లేక, కిస్తీలు కట్టలేక, ఫైనాన్స్ వేధింపులు తట్టుకోలేక చాలామంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తమ ఆటోలను కిస్తీ కట్టలేని సమయంలో ప్రైవేట్ ఫైనాన్స్ గుండాలు తమను వేధిస్తున్నారని వాపోతున్నారు. ప్రభుత్వం తమకు ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం సంవత్సరానికి 12 వేల రూపాయలు అందించాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ కి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ఇంధనం ఇన్సూరెన్స్ ధరలు తగ్గించాలని కోరుతున్నారు, ఓలా ఉబర్ రాపిడో వంటి వాటిని రద్దు చేయాలని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్ల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో ఆటో డ్రైవర్లు జేఏసీ ఆధ్వర్యంలో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన దృతం చేస్తామని ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

### నేడు రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఆటో బంద్‌ను జయప్రదం చేయండి : వీర్ల మల్లేష్

ఆటో డ్రైవర్ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని సుజాతనగర్ ఏఐటియుసి మండల అధ్యక్షుడు వీర్ల మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుజాతనగర్ మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లు తో కలిసి సమావేశం ఏర్పాటు చేసి ఆటో డ్రైవర్ల అంతా ఐక్యంగా ఉండి బంద్ ను జయప్రదం చేయాలని కోరారు.

# త్వరలో కొత్తగూడెంలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం

**-ప్రజలకు తీరనున్న పాస్‌పోర్ట్ కష్టాలు**
**-కొత్తగూడెం హెచ్ పోస్టాఫీసులో ఏర్పాటుకు చర్యలు**
**- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని హెచ్ పోస్టాఫీసులో త్వరలోనే పోస్ట్ ఆఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం (పిఓపిఎస్కె) ఏర్పాటు కానుందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెంలో పాస్‌పోర్ట్ కేంద్రం ఏర్పాటు చేయాలని తాను కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు, ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయానికి సమర్పించిన లేఖలు, సంప్రదింపులపై అధికారులు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఈ మేరకు హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి అనుమతితో కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పీఎస్‌పీ డివిజన్ అండర్ సెక్రటరీకి పరిశీలన నిమిత్తం ప్రతిపాదనలు పంపించినట్లు వివరించారు. కొత్తగూడెం ప్రధాన పారిశ్రామిక, గనుల, వాణిజ్య కేంద్రంగా విస్తరించి ఉందని, ఇక్కడి నుంచి విదేశాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం పాస్‌పోర్ట్ సేవల కోసం 75 కిలోమీటర్ల దూరంలోని ఖమ్మం, మహబూబాబాద్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని గుర్తు చేశారు. దీనివల్ల వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, ప్రజలు సమయం, డబ్బు వృధా చేసుకుంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ అనంతరం కొత్తగూడెం ప్రత్యేక జిల్లా కేంద్రంగా మారినందున ఇక్కడే పూర్తిస్థాయి కేంద్రం అవసరమని స్పష్టం చేశారు. ఈ సమస్యను కేంద్ర మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లి అనుమతులు సాధించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నామని తెలిపారు. త్వరలోనే కేంద్రం నుంచి అధికారిక ఆదేశాలు వెలువడి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం అందుబాటులోకి రానుందని కూనంనేని తెలిపారు.

# నేడు వీసంశెట్టి 50వ వర్ధంతి

**- హాజరు కానున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని**



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ మండల వ్యాప్తంగా సిపిఐ పార్టీ బలోపేతానికి కృషి చేసిన అమరజీవి వీసంశెట్టి వెంకటేశ్వర్లు 50 వ, వర్ధంతి వేడుకలను నాగారంలోని ఆయన స్మారక స్థూపం వద్ద సిపిఐ మండల పార్టీ ఆధ్వర్యంలో నేడు నిర్వహిస్తున్నారు. బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన ప్రజా నాయకుడు వీసంశెట్టి వెంకటేశ్వర్లు. ఆయన జీవితాంతం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేశారు. సిపిఐ ఖమ్మం జిల్లా మాజీ కౌన్సిల్ సభ్యులుగా పార్టీ విస్తరణ కోసం పాటుపడ్డారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, సామాజిక సమానత్వం కోసం, పేద ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం. ప్రజా సమస్యలను తన సమస్యలుగా భావించిపేదలు, కార్మికులు, కర్షకులు, దళితులు, గిరిజనులు వారి హక్కులను సాధించటానికి ఆయన చేసిన ఉద్యమాలను ఇప్పటికీ పాల్వంచ మండల ప్రజలు గుర్తుకు చేసుకొంటారు.పాల్వంచ, బూర్గంపాడు, ములకలపల్లి మండలాల్లో భూమి కోసం, భుక్తి కోసం వ్యావసాయ కూలీలు, పారేర్ల సమస్యలపై పోరాటాలు నిర్వహించి, భూస్వాములు, జాగిరిదారులకు, దొరల పాలనకు వ్యతిరేకంగా సమానత్వం కోసం కుల వివక్షతకు, రెండు గ్లాసుల విధానాలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలను సాగించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆనాటి అజ్ఞాత దళ నాయకులు నల్లమల్ల గిరిప్రసాద్ నాయకత్వంలో సిపిపై నాయకుడిగా పని చేశారు. పువ్వాడ నాగేశ్వరరావు, మనుబోతుల కొమురయ్య, ఆళ్ళ గురుప్రసాద్‌ల నాయకత్వంలో నూతి వెంకటరావు, యాదాల కాసీం, నకిరెకంటి రాములు, చారుగొండ్ల వెంకటనారాయణ, దేవరపల్లి ముత్తయ్య తదితరులతో కలిసి తన జీవితాన్ని పార్టీకి అంకితం చేశారు. తదనంతరం ఆయన కుమారుడు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, వీసంశెట్టి విశ్వేశ్వరరావులు పార్టీలో ఆదర్శవంతంగా నిజాయితీ, నిభద్దతతో పార్టీలో నేటికీ కొనసాగుతున్నారు. పెద్ద కుమారుడు పూర్ణచందర్‌రావు పాల్వంచ మండల కార్యదర్శిగా పార్టీకి తన సేవలను అందిస్తున్నారు. చిన్న కుమారుడు ప్రజా సంఘాలలో బాద్యులుగా, కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ పాల్వంచ 44వ, డివిజన్ కార్పోరేటర్‌గా ఎన్నికయ్యారు. పార్టీకి జీవితాన్ని అంకితం చేసిన ఆమహానీయుడు వీసంశెట్టి వెంకటేశ్వర్లు సేవలను స్మరించుకొంటూ ఆయనకు ఘనంగా నివాళులర్పిద్దాం. ఆయన ఆశయాల సాధన కోసం పునరంకితం కావాలని, నేడు నాగారం గ్రామంలో జరిగే ఆయన 50వ, వర్ధంతి వేడుకలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, నరాటి ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ, ఉప్పుశెట్టి రాహుల్ తదితర నాయకులు హాజరువుతున్నారు. పార్టీలకు అతీతంగా, సబ్బండ వర్గాల ప్రజలు హాజరై వెంకటేశ్వర్లు వర్ధంతి వేడుకలను జయప్రదం చేయాలని పార్టీ మండల నాయకత్వం కోరుచున్నది.

# ఎమ్మెల్యే పాయం ఇంటి ముట్టడికి సిద్ధం



**ప్రజాపక్షం/మణుగూరు:** అలెం కోటి హెచ్చరిక ఆదివాసి నాయకుడిగా, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నేను అలెం కోటి మాట్లాడుతున్నాను. గత నాలుగు రోజులుగా పినపాక నియోజకవర్గం గుండాల మండలంలోని ఏకలవ్య పాఠశాలలో ఆదివాసీ విద్యార్థులు అన్యాయానికి గురవుతున్నారని తుడుందెబ్బ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతూ రిలే నిరాహార దీక్షలు చేస్తూ గుండాలలో జరిగిన సంఘటనను ప్రశ్నిస్తున్నాము. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఈ సమస్యను పట్టించుకోవడం లేదని ప్రజల తరపున ప్రశ్నించినందుకు నాపై కొంతమంది అధికారుల ద్వారా బెదిరింపులకు పాల్పడుతున్నారని తీవ్రంగా ఖండిస్తున్నాము. ఆదివాసి బిడ్డల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కలిగిన ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యలను సరిదిద్దే దిశగా చర్యలు తీసుకోవాలి. కానీ ప్రశ్నించిన వారిపై రాజకీయ ఒత్తిళ్లు, బెదిరింపులు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఇలాగే ముందు కూడా ఆదివాసి సమాజ సమస్యలను లేవనెత్తిన ఉద్యమ నాయకులు, ప్రజా ప్రతినిధులపై ఒత్తిళ్లు కొనసాగితే ఆదివాసి సమాజం చూస్తూ ఊరుకోదు. అవసరమైతే ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నివాసం వద్ద నిరసన కార్యక్రమాలు, ఇంటి ముట్టడి వంటి ఆందోళనలకు దిగాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాము. తప్పులను ఎత్తిచూపిన వారిని లక్ష్యంగా చేసుకోవడం కాకుండా, సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము. ఆదివాసుల హక్కులు, విద్యార్థుల భవిష్యత్తు విషయంలో ఎలాంటి రాజీ ఉండదు.


## అంగన్వాడీ భవన నిర్మాణం చేపట్టాలి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలపరిధిలోని గుండెపూడి గ్రామంలోని అంగన్వాడీ భవనాన్ని వెంటనే నిర్మాణం చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు భానోత్ మధు డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం ముఖ్యుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ గతంలో శిథిలావస్థకు చేరడంతో అక్కడ ఉన్న భవనాన్ని కూల్చివేశారు. కూల్చివేసి దాదాపుగా ఆరేడు నెలలు కావస్తున్న అంగన్వాడి భవనం మంజూరైనా ఇప్పటివరకు భవన నిర్మాణం చేపట్టకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఇప్పటికే అంగన్వాడి కేంద్రం అద్దె భవనాల్లో నిర్వహణ జరుగుతుందని, అద్దెలు కట్టలేని పరిస్థితులలో అంగన్వాడి టీచర్లు ఉన్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సిపిఎం నాయకులు అంగన్వాడి భవనాన్ని పరిశీలించడం జరిగిందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్వాడి కేంద్రాన్ని వెంటనే నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనియెడల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఈ అంగన్వాడి భవనం నిర్మాణం చేపట్టే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు వల్ల మల్ల చందర్ రావు, శాఖ కార్యదర్శి ఇల్లంగి సీతారాములు, ఇస్లావత్ భద్రు, వల్ల మల్ల దానయ్య, అనగంటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయికి చెక్..ముగ్గురికి పునరావాసం

**-గంజాయి సేవిస్తున్న ముగ్గురిని పట్టుకున్న పోలీసులు**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** గంజాయి సేవనం, విక్రయాలపై బూర్గంపాడు ఎస్‌ఐ మేడ ప్రసాద్ ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. ఆయన ఆధ్వర్యంలో పోలీసులు తాళ్లగొమ్మూరు సమీపంలోని ఐటీసీ జామాయిల్ ప్లాంటేషన్‌లో గంజాయి సేవిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల్లో గంజాయి సేవించినట్లు నిర్ధారణ కావడంతో వారిని భద్రాచలం పునరావాస కేంద్రానికి తరలించారు. ఈవిషయంపై ఎస్‌ఐ మేడ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం గడికొప్పుల శశికుమార్, సోము సీతారామిరెడ్డి, మహమ్మద్ అఫ్రోజ్ గంజాయి సేవిస్తూ పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకున్న అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించగా గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయిందన్నారు.

**సమాచారం ఇస్తే గోప్యంగా ఉంచుతాం...**

మండల పరిధిలో గంజాయి సేవనం, విక్రయాలు, అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్‌ఐ మేడ ప్రసాద్ కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గంజాయి నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా ముత్యాలమ్మ తల్లి పూజలు



**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లి మండలంలోని కామేపల్లి, జాస్తిపల్లి, ముచ్చర్ల, పాతలింగాల గ్రామాల్లో ముత్యాలమ్మ తల్లికి మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున జల బిందెలతో అమ్మవారికి అభిషేకాలు చేసి, అనంతరం బోనాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, పిల్లాపాపలు, పశువులు, గేదెలు ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు అజ్మీర బుల్లి, ధరావత్ నాగమణి, లూసీ, కిన్నెర సుజాత, గ్రామ పెద్దలు మల్లెంపాటి శ్రీనివాసరావు, శివయ్య, రామ్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, జాస్తిపల్లి ఉప సర్పంచ్ గేముల దేవండ్ల శైలజ తదితరులు పాల్గొన్నారు.

## బంజారా సంస్కృతిలో తీజ్‌కు ప్రత్యేక స్థానం



**ప్రజాపక్షం/కారేపల్లి:** బంజారా సంస్కృతిలో తీజ్ పండుగకు ప్రత్యేక స్థానం ఉందని భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్ అన్నారు. ప్రకృతిని, భూమిని, పంటలను, పశుసంపదను ఆరాధిస్తూ బంజారా సమాజం తరతరాలుగా జీవిస్తోందని తెలిపారు. భాగ్యనగర్ తండాలో తొమ్మిది రోజులుగా యువతులు భక్తిశ్రద్ధలతో తీజ్ పూజలు నిర్వహించి, నిమజ్జన కార్యక్రమంలో భాగంగా దేవుళ్లకు నైవేద్యాలు సమర్పించారు. అనంతరం బంజారా సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గుగులోత్ భీముడు నాయక్, బానోత్‌రాందాస్ నాయక్, లకావత్ దామ్లా, భగవాన్‌దాస్, హాతీయ, బాబా, తోప్య, బానోత్ రాంచందర్, బానోత్ మంగీలాల్, లావుడ్యా ఈర్య, భూక్య తారాచంద్, వీరన్న, గాంధీ, రాంబాబు, గోబ్రియ, బాబు, తదితరులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల పండుగ



**ప్రజాపక్షం/కారేపల్లి:** తెలంగాణ సంస్కృతిలో భాగమైన బోనాల పండుగను గ్రామ పంచాయితీలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని ముత్యాలమ్మ తల్లికి మహిళలు మట్టి, రాగి కుండల్లో అన్నం, పాలు, బెల్లంతో నైవేద్యం సిద్ధం చేసి సమర్పించారు. ఈసందర్భంగా సర్పంచ్ గుమ్మడి సందీప్ మాట్లాడుతూ బోనాల పండుగను తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తించిన అనంతరం మరింత ప్రాచుర్యం పొందిందన్నారు. గ్రామం పచ్చగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామం అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్ధించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు గుమ్మడి ఎర్రయ్య, ముత్తి రామారావు, గుగ్గిల రామారావు, దోమల నాగేశ్వరరావు, కొడం సీతారాములు, ఉప సర్పంచ్ బిక్కసాని భాస్కర్‌రావు, పాలకవర్గ సభ్యులు దోమల సీత, కొడెం రమణ, గుమ్మడి నరసింహారావుతో పాటు గ్రామ మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

## బోనమెత్తిన పల్లెలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని వివిధ గ్రామాలలో ఆదివారం బోనమెత్తారు. ముత్యాలమ్మ తల్లి పండగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో, కోలాటం, నృత్యాలతో సందడి చేశారు. బోనాలను ఎత్తుకుని ప్రదర్శన నిర్వహించారు. అమ్మవారికి బోనాల సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలు గ్రామాలలో కుటుంబ సభ్యులతో పాటు, బంధువులు రాకతో సందడి వాతావరణం నెలకొంది. వర్షాలు సమృద్ధిగా పడాలని, పాడి పంటలతో ప్రజలు సంతోషంగా ఉండాలని కొత్తకొత్తూరు గ్రామంలో బొడ్రాయి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలతో గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, సర్పంచ్ కళావతి, ఉప సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ పాల్గొన్నారు.

# నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలి

**-సిపిఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతుందని వెంటనే ధరలను తగ్గించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం నగరంలోని త్రీటౌన్ పరిధిలోని పంపింగ్ వెల్ రోడ్డులో సిపిఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న వైఖరిని ఖండించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలను అంటాయని , సామాన్య ప్రజలు ఏ వస్తువును కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. చెరుకు ముడి సరుకును పెట్రోల్‌లో కలపడం వంటి నిర్ణయం వల్ల షుగర్ ధరలు పెరగడంతో పాటు ఈ20 పెట్రోల్ వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. ప్రజా సమస్యలపై గళం విప్పుతున్న విద్యార్థులు, యువతపై తప్పుడు కేసులు బనాయించి ఇతర అంశాలను తెరపైకి తెచ్చి అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ధరల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో త్రీటౌన్ సహాయ కార్యదర్శి భూక్యా రవీందర్, నామ విజయ్‌కుమార్, నూనె నందు, చిర్రా వెంకన్న, డి. సురేష్ నాయక్, నక్కా లింగయ్య, ముజామిల్, రమేష్, రవి పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ల బంద్‌కు సిపిఐ మద్దతు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సోమవారం నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త బంద్‌కు సిపిఐ ఖమ్మంజిల్లా సమితి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. మహ లక్ష్మి పథకం వల్ల ఆటో డ్రైవర్లకు ఉపాధి కరువైందన్నారు. పెరిగిన ఇంధన ధరలు, అధిక పన్నులు, ఇన్సూరెన్స్ భారంతో డ్రైవర్లు ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఓలా, ఊబర్, ర్యాపిడో వంటి యాప్‌ల వల్ల ఉపాధి కోల్పోతున్నారన్నారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు పెట్రోల్ ధరలను తగ్గించాలని, డ్రైవర్లకు సామాజిక భద్రత, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. ఆటోల బంద్‌కు ప్రజలు కూడా సహకరించాలని సురేష్ కోరారు.

# ముత్యాలమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలు



**ప్రజాపక్షం/చింతకాని :** శ్రావణమాసం సందర్భంగా చింతకాని మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం ముత్యాలమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. మహిళలు సాంప్రదాయబద్ధంగా అలంకరించుకున్న బోనాలను నెత్తిన ఎత్తుకుని మేళతాళాల మధ్య దేవాలయాలకు చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాల వద్ద భక్తుల సందడితో పండగ వాతావరణం నెలకొంది. గ్రామాల్లో ఎటుచూసినా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. శ్రావణ మాసంలో ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని ప్రజలు తెలిపారు.

# ముస్లింల అభివృద్ధికి మంత్రి తుమ్మల చొరవ

**-ఖబరస్తాన్‌లకు నిధుల కేటాయింపుపై హర్షం**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ముస్లిం మైనార్టీల అభ్యున్నతి కోసం చొరవ చూపడంతో పాటు ఖబరస్తాన్‌లకు నిధుల కేటాయింపు పట్ల ముస్లిం నాయకులు, మత పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ రషీద్ తో పాటు జామియత్ ఉలామా ఖమ్మం జిల్లా అధ్యక్షులు మౌలానా మహ్మద్, సయ్యద్ అహ్మద్ ఖాస్మీ తదితర మత గురువులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖబరస్తాన్ స్థలాలు , ప్రహరీ గోడల నిర్మాణానికి నిధులు కేటాయించడం జరిగిందన్నారు. తాత్కాలిక ప్రయోజనాలే కాకుండా భవిష్యత్తు తరాల కోసం శాశ్వత వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందన్నారు. కుల, మతాలకు అతీతంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు షానవాజ్, అబ్దుల్ మజీద్, అబ్దుల్ రెహ్మాన్, మౌలానా, గనీ, ముఫ్తీ ఇమ్రాన్‌ఖాన్, ముఫ్తీ షుజావుద్దీన్, ముఫ్తీ అల్లావుద్దీన్, మౌలానా సయ్యద్ షాబీర్, హఫీజ్, ఉస్మాన్ ఖాసీం, గౌస్, సాజిద్, రహీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# కలకోటలో రేషన్‌కార్డులు, స్మార్ట్‌కార్డుల పంపిణీ



**ప్రజాపక్షం/బోనకల్ :** మండలంలోని కలకోట గ్రామంలో నూతన రేషన్‌కార్డులు, స్మార్ట్‌కార్డులను టిపిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్‌కుమార్, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనంద రావు సర్పంచ్ పైడిపల్లి అనిత చేతుల మీదుగా ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొత్తగుండ్ల వేణు, పాలకమండలి సభ్యు లు తోటపల్లి సువార్త, యంగల కృష్ణవేణి, మాతంగి శ్రీనివాసరావు, గ్రామపెద్దలు తోటపల్లి కోటయ్య, యంగళ మోహన్‌రావు, గ్రామ పరిపాలన అధికారి జంగాల శ్రీనివాసరావు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి చెస్ పోటీలకు సాయిస్ఫూర్తి డీపీవీ విద్యార్థులు ఎంపిక




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** హైదరాబాద్ సమీపంలోని బానూర్ డీపీవీ పాఠశాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్17 చెస్ పోటీల్లో మండల పరిధిలోని బి.గంగారం సాయిస్ఫూర్తి డీపీవీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన వినుకొండ శ్రాగ్వీ, భవ్యశ్రీ లక్ష్మి, దేదీప్తి, సాత్విక జాతీయస్థాయి చెస్ పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రిన్స్ పాల్ సాయిశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జట్టు కెప్టెన్‌గా వ్యవహరించిన శ్రాగ్వీ తన జట్టును జాతీయస్థాయికి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషించింది. విద్యార్థుల ప్రతిభను పాఠశాల యాజమాన్య చైర్మన్ దాసరి ప్రభాకర్‌రెడ్డి అభినందించారు. పాఠశాల పీఈటీ కుమార్, రామిశెట్టి, అనిత తదితరులు ప్రత్యేకంగా అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లోనూ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి పాఠశాలకు, సత్తుపల్లి ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

# ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్‌కు పూజలు



**ప్రజాపక్షం/మధిర:** మధిర మండలం వంగవీడు గ్రామంలో బంజారా సమాజ ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్, మేరమా యాడి ఆరాధన వేడుకలను తండా ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ చిత్రపటం ముందు సంప్రదాయ పద్ధతిలో భోగ్, హోమ కార్యక్రమాలను నిర్వహించి నెయ్యితో బియ్యం, పాయసం తదితర ప్రసాదాలను హో మాగ్నికి నైవేద్యంగా సమర్పించారు. గ్రామ ప్రజలకు ఆరోగ్యం, సుఖశాంతులు, పంటల సంవృద్ధి, పశు సంపద అభివృద్ధి కలగాలని ప్రార్థించారు. బంజారా సంప్రదాయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన మేరమా యాడికి తండా ప్రజలు సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తండా నాయక్, కార్బారి, తండా పెద్దలు, యువత, మహిళ లు, గ్రామ బంజారా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు.

# మిత్రుని కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తమతో కలిసి చదువుకుని తనువు చాలించిన మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు తోటి మిత్రులు. ఖమ్మం నగరంలోని రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో (1999 2000) సంవత్సరంలో పదవ తరగతిలో తమతో కలిసి చదువుకుని హైదరాబాద్‌లో స్థిరపడిన దండు రామకృష్ణ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. అట్టి విషయాన్ని తెలుసుకున్న పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన తోటి స్నేహితులు (వాట్సాప్ గ్రూప్) ద్వారా ఆ కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. తద్వారా సేకరించిన రూ. 90వేలను ఆదివారం హైదరాబాద్ వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.మృతుని కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులకు రామకృష్ణ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుడు షేక్ మదార్, మొగిలి శ్రీనివాసరావు, గుజ్జులూరి ఉప్పలయ్య (కోర్టు ఉద్యోగి), సల్లూరి భాస్కర్ (డిఫెన్స్ ఉద్యోగి), పేరబోయిన తిరుపతిరావు, ఎర్రగాని రఘు తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా పఠాన్ మస్తాన్



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిధిలోని పెద్దమండవ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామశాఖ అధ్యక్షుడిగా పఠాన్ మస్తాన్ ఖాన్ ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లిపాటి కృష్ణ, గ్రామ ఇంచార్జి రమణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహదారు కమిటీ సభ్యుడు మీగడ శ్రీనివాస్, గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు సింగ్ వేణు, సర్పంచి లంకెల కోటిరెడ్డి, మత్తేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరావు, సీనియర్ నాయకుడు కోడె నాగేశ్వరరావు, ఉప సర్పంచి కుక్క సైదులు, మాజీ ఎంపీటీసీ కుక్కల వెంకటరావు, వినుగంటి ప్రవీణ్, పెంట్ల నాగేశ్వరరావు, కుక్కల చిన్న వెంకయ్య, కుక్కల కొండ, ఏడో వార్డు సభ్యుడు కుక్కల శ్రీను, పఠాన్ బిలాల్ ఖాన్, పఠాన్ మజీద్ ఖాన్, ఇమ్రాన్ ఖాన్, తాళ్ల వెంకటేశ్వర్లు, ఆదాం షేక్ ఖాదర్ సాహెబ్, షేక్ రెహమాన్, పఠాన్ నాగుల్ ఖాన్, పఠాన్ బాబు ఖాన్, అల్లిక వెంకటేశ్వర్లు, నాగారపు రమేష్, నాగల నర్సయ్య, కందిమల్ల సీతయ్య తదితరులు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజా ఉద్యమకారులను 'దిమాగీ నక్సలైట్లు'గా చిత్రించడం దుర్మార్గం




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ప్రజా ఉద్యమకారులను 'దిమాగీ నక్సలైట్లు'గా చిత్రించడం దుర్మార్గమని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోకినేపల్లి వెంకటేశ్వరరావు విమర్శించారు. ఆదివారం కల్లూరు డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజా ఉద్యమాలను అణచివేస్తోందని ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యదర్శి సీవై పుల్లయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, పింఛన్లను వెంటనే చెల్లించాలని, సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని, పోడు భూముల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర ధరలను తగ్గించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖాళీ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలి

**ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఉపేందర్**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రాష్ట్రంలో సుమారు 20 వేల కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం కేవలం 7 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్ అన్నారు. ఖాళీగా ఉన్న అన్ని కానిస్టేబుల్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రము లోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్టలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. వేలాది మంది యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో భర్తీ చేయకుండా పరిమిత సంఖ్యలో పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్లు ఇవ్వడం వల్ల నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ప్రతి సంవత్సరం సుమారు 9 వేల మంది ఉద్యోగ విరమణ పొందుతున్నప్పటికీ, ఆ స్థానాల్లో కొత్త నియామకాలు చేపట్టడం లేదని విమర్శించారు. ఖాళీ పోస్టులన్నింటినీ గుర్తించి, ఒకేసారి నియామక ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం యువత లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకుంటూ, నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల నిరుద్యోగుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందని ఆయన విమర్శించారు. కేంద్రంలో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఆ హామీ అమలు కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. యువత, నిరుద్యోగుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి పాలపాటి అశోక్, కోశాధికారి బాలిన కృష్ణంరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మూడు శ్రీనివాస్, నవీన్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

**-ఎంఎల్‌ఏ జారె ఆదినారాయణ**



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అశ్వారావుపేట ఎంఎల్ఏ జారె ఆదినారాయణ అన్నారు. ఆదివారం చంద్రుగొండ మండలం గుర్రాయిగూడెం, రావికంపాడు గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. గుర్రాయిగూడెంలో పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రావికంపాడులో బోనాల ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాయం మాధవి నూతన గృహప్రవేశానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న రామిశెట్టి నరసింహస్వామి, షేక్ అమీర్‌లను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కాంగ్రెస్ గ్రామ సేవాదళ్ అధ్యక్షుడు రేఖం నరేష్ మాతృమూర్తి దివంగత రేఖం కాంతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రజా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఎంఎల్ఏ భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నాయకపోడు చిత్రకళకు కొత్త దిశ

**ప్రజాపక్షం/ములకలపల్లి:** నాయకపోడు గిరిజన చిత్రకళా సంప్రదాయ పరిరక్షణ, కళాకారుల జీవనోపాధి మెరుగుదల లక్ష్యంగా హస్తకళల సేవా కేంద్రం వరంగల్ ఆధ్వర్యంలో కమలాపురం గురుకుల ఆశ్రమ పాఠశాలలో పెయింటింగ్ చౌపాల్ నిర్వహించారు. హస్తకళల సేవా కేంద్రం సహాయ సంచాలకులు దివ్యారావు అధ్యక్షత వహించారు. గ్రామీణ కళాకారుల గుర్తింపు, ప్రభుత్వ పథకాలు, నైపుణ్య శిక్షణ, డిజిటల్ నమోదు, మార్కెట్ మద్దతుపై అవగాహన కల్పించారు. పహ్చాన్ కార్డు ద్వారా హస్తకళల మంత్రిత్వ శాఖ పథకాలకు అర్హత పొందవచ్చని, సమర్థ్‌శిక్షణలో రోజుకు రూ 300 భత్యంతో పాటు ఉచిత ముడిసరుకు అందుతుందని అధికారులు వివరించారు. గురు, శిష్య శిక్షణ, నైపుణ్య ఆధునికీకరణ, డిజైన్, సాంకేతిక శిక్షణల ద్వారా ఉచిత శిక్షణ, టూల్‌కిట్లు అందుతాయని తెలిపారు. నాయకపోడు చిత్రాలకు మార్కెట్ డిమాండ్ ఉన్నందున 30 మంది కళాకారులతో సొసైటీ ఏర్పాటు చేసి, డిజైన్, ఆధునిక సాంకేతికత, మార్కెటింగ్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ముద్రా రుణాలు, క్రాఫ్ట్ మేళాలు, ప్రదర్శనలు, ఈ కామర్స్ మార్కెటింగ్, జాతీయ అవార్డుల అవకాశాలను వివరించారు. కళాకారిణి చిటిక కమలాకుమారి చిత్రాలను అధికారులు, పాల్గొన్నవారు అభినందించారు. కళాకారులు తమ సమస్యలు, మౌలిక వసతుల కొరతను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈకార్యక్రమంలో హస్తకళల ప్రోత్సాహక అధికారి ప్రవీణ్, గ్రామ పెద్దలు జక్కు రాంబాబు, వాసం రమేష్, డిప్యూటీ సర్పంచ్ లక్ష్మీకుమారి, కళాకారులు చిటిక కమలాకుమారి, ఉరబెడ్డి వెంకన్న, చిటిక రామకృష్ణ, సాంబశివ, వెంకటేశ్వరరావు, గొల్ల వీరభద్రం, గొల్ల పెంటయ్య, చిటిక చంద్రకళ, ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమ అధికారి నవనీత్, తదితరులు పాల్గొన్నారు.



# నేడు మండలంలో రేగా కాంతారావు పర్యటన

**ప్రజాపక్షం/కరకగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, పినపాక నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు రేగా కాంతారావు నేడు కరకగూడెం మండలంలో పర్యటించనున్నట్లు కరకగూడెం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రావుల సోమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా కరకగూడెం మండల గ్రామ పంచాయతి పరిధిలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సోషల్ మీడియా గ్రామ కమిటీ అధ్యక్షులతో పాటు తమ పంచాయతీ పరిధిలో తమ యొక్క ద్విచక్రా వాహనాలతో స్వాగతం పలికెందుకు మెయిన్ సెంటర్ నందు సిద్ధముగా ఉండాలని కోరారు. ఉదయం 11: 00 గంటలకు గొల్లగూడెం, కొత్తగూడెం మెయిన్ రోడ్, కొత్తగూడెం పంచాయ,తీ స్టార్ట్ మెయిన్ రోడ్ 11:10 కి అనంతారం, తుమ్మలగూడెం, చొప్పల మెయిన్ సెంటర్, అనంతారం, పద్మపురం, 11:15 మెయిన్ రోడ్ 11:20 కి రఘునాథపాలెం, తాటిగూడెం, మోతె మెయిన్ సెంటర్ నందు ఉండాలని, 11:30 వెంకటాపురం, చిరుమల్ల, వట్టం వారిగూంపు, సమత్ బట్టుపల్లి, కరకగూడెం మెయిన్ సెంటర్ పార్టీ ఆఫీస్, 11:50 రేగళ్ల బట్టుపల్లి పార్టీ ఆఫీస్ మెయిన్ సెంటర్ 11:55 కన్నాయిగూడెం, బంగారుగూడెం, కలవల నాగారం, మెయిన్ సెంటర్ నందు తదుపరి ఇక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి మణుగూరు వెళ్లడం జరుగుతుందని కావున బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీ, సర్పంచులు, మాజీ సర్పంచ్ లు, మాజీ ఉపసర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీ లు, కోపరేటివ్ డైరెక్టర్ లు, గ్రామ కమిటీ అధ్యక్షులు మహిళా నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా సభ్యులు, అభిమానులు, ప్రజలు సకాలంలో హాజరై ఈ కార్యక్రమన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# అధికారులు సకాలంలో హాజరు కావాలి

**ప్రజాపక్షం/చుంచుపల్లి:** ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరు కావాలని మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి సుభాషిని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేయడం జరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా ప్రజా సమస్యలను పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రంతోపాటు అవసరమైన ఆధారాలు, పత్రాల ప్రతులను తీసుకువచ్చి ప్రజావాణిలో సమర్పించాలని సూచించారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే వేదికపై సంబంధిత అధికారులను సంప్రదించే అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# కారుతో ఢీకొట్టి హత్యాయత్నం

**-నిందితుడిపై కేసు నమోదు చేసిన బూర్గంపాడు పోలీసులు**

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** వివాహేతర సంబంధం విషయంలో తలెత్తిన వివాదంతో ఓ వ్యక్తిని కారుతో ఢీకొట్టి హత్య చేసేందుకు ప్రయత్నించిన ఘటన బూర్గంపాడు మండలం జింకలగూడెంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం జింకలగూడెం గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్, అదే గ్రామానికి చెందిన షేక్ మౌలానా మధ్య ఓ మహిళతో ఉన్న వివాహేతర సంబంధం విషయంలో వివాదం తలెత్తింది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఇస్మాయిల్ తన స్కార్పియో కారుతో మౌలానాను ఢీకొట్టి హత్య చేసేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మౌలానా సోదరుడు షేక్ నాగుల్ మీరా ఇచ్చిన ఫిర్యాదు మేరకు బూర్గంపాడు ఎస్ఐ మేడ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**గతంలోనే కేసులు...**

నిందితుడు షేక్ ఇస్మాయిల్‌పై గతంలో పశువుల అక్రమ రవాణాకు సంబంధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పలు కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను దర్యాప్తులో వెల్లడిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

# బతుకమ్మ ఘాట్‌కు భూమి పూజ

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండల కేంద్రంలో బతుకమ్మ ఘాట్ నిర్మాణానికి గ్రామ పెద్దలు, మాజీ ఉప సర్పంచ్ గౌరిశెట్టి నాగభూషణరావు, భారతమ్మ కుటుంబ సభ్యులు ఆదివారం భూమి పూజ చేశారు. వారి కుమారులు గౌరిశెట్టి శ్రీనివాసరావు, విజయలలిత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా సర్పంచ్ వాసం సుస్మిత పాల్గొన్నారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ హైందవ ధర్మ పరిరక్షణతో పాటు ఆలయాలకు విరాళాలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గౌరిశెట్టి కుటుంబం సేవలు అభినందనీయమన్నారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సొంత ఖర్చులతో ఘాట్ నిర్మాణానికి ముందుకు రావడం ప్రశంసనీయమన్నారు. ఈకార్యక్రమంలో వాసం శ్రీకాంత్, కే వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, సయ్యద్ ఆరిఫ్, ఎస్ఐ సోమేశ్వరరావు, అబ్బు నాగేశ్వరరావు, నరెడ్ల వెంకన్న, బూరుగడ్డ రాములు, సిరునోముల వజ్రేశ్వరరావు, మహమ్మద్ అతహార్, తెలగాని శ్రీనివాస్, తులం ముత్తిలింగం, సిరునోముల శ్రీనివాసరావు, నరేష్, సంక కిరణ్, పానుగంటి మంగ, పద్మ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

# గడ్డి చెరువుకు ఓసీ నీరు..రైతులకు ఊరట



**ప్రజాపక్షం/ఇల్లందు:** లచ్చిగూడెం గ్రామ పంచాయితీ పరిధిలోని గడ్డి చెరువులో నీరు లేక రైతులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించేందుకు ఇల్లందు ఎంఎల్ఏ కోరం కనకయ్య తక్షణ చర్యలు చేపట్టారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు సింగరేణి జీఎం ఈసం కృష్ణయ్యతో కలిసి బైక్‌పై చెరువును స్వయంగా పరిశీలించారు. ఓపెన్ కాస్ట్‌లో అందుబాటులో ఉన్న నీటిని తక్షణమే గడ్డి చెరువులోకి మళ్లించేలా అధికారులను ఆదేశించారు. దీంతో సాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లక్కినేని శ్యామ్, నియోజకవర్గ నాయకుడు కోరం సురేందర్, లచ్చగూడెం సర్పంచ్ ఎదలపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాద్, మండల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కేజీబీవీ హాస్టల్‌లో కోతుల బెడద..!



**ప్రజాపక్షం/కరకగూడెం:** స్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం భట్టుపలి (కెజిబివి) హాస్టల్‌లో విద్యార్థులు కోతుల బెడదతో తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గత కొంతకాలంగా హాస్టల్ పరిసరాల్లో కోతులు హల్‌చల్ చేస్తూ విద్యార్థులను భయపెట్టడంతో పాటు, హాస్టల్ గదుల్లోకి ప్రవేశించి విద్యార్థులను గీకుతున్న ఘటనలు కూడా జరుగుతున్నాయని విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతులు హాస్టల్‌లోకి ప్రవేశించడం వల్ల విద్యార్థుల భద్రతకు ముప్పు ఏర్పడటంతో పాటు, చిన్నారులు భయంతో గదుల్లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కోతుల దాడుల వల్ల విద్యార్థులకు గాయాలయ్యే ప్రమాదం కూడా ఉందని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఈ బయ్యారం (ఎఫ్ఆర్ఓ) ప్రత్యేక చొరవ తీసుకొని కెజిబివి హాస్టల్‌ను స్వయంగా సందర్శించి పరిస్థితిని పరిశీలించాలని విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు. కోతులను ఎలాంటి హాని కలిగించకుండా, అటవీశాఖ నిబంధనలకు అనుగుణంగా సురక్షితంగా పట్టుకొని అటవీ ప్రాంతంలోకి తరలించే చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. మా భద్రత కోసం కోతులను సురక్షితంగా అడవిలోకి పంపించే చర్యలు తీసుకోండి" అని కెజిబివి విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది అటవీ అధికారులను కోరుతున్నారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి, హాస్టల్‌ను సందర్శించి, కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు కూడా కోరుతున్నారు.

# తల్లాడ కాంగ్రెస్‌లో అసంతృప్తి సెగలు..!



-నేతల వలసలపై జోరుగా చర్చ
-గుర్తింపు లేదంటూ కొందరి అసంతృప్తి
-త్వరలో జరగనున్న
ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల వేళ రాజకీయ వేడి




**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలో అధికార పార్టీకి అంతర్గత అసంతృప్తి సెగలు తగులుతున్నాయా...? పార్టీ కోసం కష్టపడిన కొందరు నాయకులు తమకు తగిన గుర్తింపు, గౌరవం లభించడం లేదనే అసంతృప్తితో పార్టీ మారే ఆలోచనలో ఉన్నారనే ప్రచారం ప్రస్తుతం మండల రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ విజయానికి క్షేత్ర స్థాయిలో కీలకంగా పనిచేసిన కొందరు నాయకులు, కార్యకర్తలకు ప్రస్తుత పరిణామాల్లో తగిన ప్రాధాన్యత దక్కడం లేదనే భావన వ్యక్తమవుతున్నట్లు తెలుస్తుంది. దీనితో కొందరు నేతలు ప్రత్యామ్నాయ రాజకీయ వేదికల వైపు దృష్టి సారిస్తున్నారనే చర్చ జరుగుతుంది. ఇప్పటికే పలువురు నాయకులు బిఆర్ఎస్, బిజెపి నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో వినిపిస్తుంది. అయితే పార్టీ మార్పుపై ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీనితో ఈ ప్రచారం ఎంత వరకు వాస్తవమో తెలియాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

### ఎందుకు అసంతృప్తి...?

పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడిన నాయకులకు తగిన గుర్తింపు, పదవులు, రాజకీయ ప్రాధాన్యత దక్కడం లేదనే భావన అసంతృప్తికి కారణమవుతుందని వారి అనుచరుల్లో చర్చ జరుగుతుంది. కొందరు నాయకులు సన్నిహితుల వద్ద వ్యక్తం చేసినట్లు సమాచారం. తల్లాడలో కాంగ్రెస్ పార్టీలో పలు గ్రూపులు ఉన్న నాయకులు ఒకరిని మరొకరు ఎదగనివ్వకుండా తొక్కిపెట్టే పనిలో ఉన్నారని పార్టీ శ్రేణులు వాపోతున్నారు. పదేళ్ల నుండి బిఆర్ఎస్ పార్టీ అధికారం పదేళ్లు ఉన్నప్పుడు నుండి ఇబ్బంది ఎదుర్కొంటున్న కాంగ్రెస్ శ్రేణులు ఇప్పటికి కూడా పార్టీ సహాయ సహకారాలు అందకపోవడంతో యువ నాయకులతో సైతం ఎదురు తిరిగే పరిస్థితి వచ్చిందని కనిపిస్తుంది. గ్రామ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ఎన్నికల సమయంలో పనిచేసిన యువ నాయకులకి పార్టీ నుండి తగిన సహాయ సహకారాలు అందకపోవడంతో యువ నాయకుడు కూడా ఆలోచనలో పడినట్టు తెలుస్తుంది.

### ఎన్నికల వేళ ప్రభావం ఎంత...?

తల్లాడలో కాంగ్రెస్‌కు చెందిన ముఖ్య నాయకులు పార్టీని వీడితే దాని ప్రభావం రాబోయే ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలపై పడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మండల స్థాయిలో నాయకత్వం బలహీనపడితే క్షేత్రస్థాయి ఎన్నికల్లో పార్టీకి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మరో వైపు అసంతృప్తిగా ఉన్న నాయకులను కాంగ్రెస్ అధిష్టానం గుర్తించి వారితో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరిస్తుందా...? లేక నేతల వలసలను అడ్డుకునేందుకు చర్యలు చేపడుతుందా...? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. తల్లాడ మండలంలో వినిపిస్తున్న అసంతృప్తి మాటలు వాస్తవ రూపం దాల్చుతాయా లేక కాంగ్రెస్ నాయకత్వం ముందుగానే దిద్దుబాటు చర్యలు చేపట్టే పరిస్థితిని చక్కదిద్దుతుందా...? అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన అనంతరం సత్తుపల్లి నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులను ఒక్క తాటిపై తీసుకు రావడంలో ఎంఎల్‌ఎ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విఫలమైందని పలువురు చెబుతున్నారు. మరో సారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందాలంటే మండల స్థాయి నాయకులను సంతృప్తి గురించి పార్టీ బలోపేతం కోసం తయారు చేయాల్సి వస్తుందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా సత్తుపల్లి ఎంఎల్‌ఎ రాగమయి రాష్ట్ర నాయకులు దయానంద్ మండలంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన వివిధ వర్గాలకు చెందిన నాయకులను అట్టి అభివృద్ధి కోసం పనిచేసేలా చేయాలి. లేనిచో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి తల్లాడ మండలంలో కష్టంగా ఉంటుందని పలువురు అంటున్నారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులను తీసుకువచ్చి పార్టీ కోసం పనిచేసే విధంగా తయారు చేయకపోతే రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి సత్తుపల్లి నియోజక వర్గంలో అయోమయంగా ఉంటుందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా సత్తుపల్లి ఎంఎల్‌ఎ మట్టా రాగమయి, రాష్ట్ర నాయకులు దయానంద్ ఈ విషయంపై దృష్టిసారించి తగు చర్యలు తీసుకోకపోతే బిజెపి, బిఆర్ఎస్ వైపు నాయకులు వెళ్లే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

# గోదావరి జలాలతో చెరువులు నింపి రైతులను ఆదుకోవాలి

-యాప్ విధానంతో రైతుల ఇబ్బందులు
-పాత పద్ధతిలోనే ఎరువులు అందించాలి
-మాజీ వ్యవసాయ మార్కెట్ వైస్ ఛైర్మన్ భద్రరాజు



**ప్రజాపక్షం/తల్లాడ :** గోదావరి జలాలను వినియోగించుకుని తల్లాడ మండలంలోని అన్ని చెరువులు, కుంటలను నింపి పంటలు సాగు చేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తల్లాడ మండల టిడిపి నాయకులు, మాజీ వైరా వ్యవసాయ మార్కెట్ వైస్ ఛైర్మన్ ధూపాటి భద్రరాజు కోరారు. ఇటీవల కురిసిన వర్షాలతో కొంత మేర నీటి లభ్యత పెరిగినప్పటికీ మండలంలోని అనేక చెరువులు పూర్తి స్థాయిలో నిండకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. సాగునీటి కారణంగా పంటలు ఎండిపోయే పరిస్థితి రాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించి తల్లాడ మండలంలోని చెరువులు, కుంటలు, సాగునీటి వనరులను నింపితే భూగర్భ జలాలు పెరగడంతో పాటు వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. పంటలు వేసిన రైతులకు సాగునీరు అందేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. మండలంలో యూరియా, ఎరువుల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. యూరియా పంపిణీకి యాప్ విధానం అమలు చేయడం వల్ల సాంకేతిక సమస్యలు, సర్వర్ సమస్యలు, రిజిస్ట్రేషన్ తదితర కారణాలతో రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుందని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని గతంలో మాదిరే సులభమైన పద్ధతిలో అందించే అంశాన్ని పరిశీలించాలని ఆయన కోరారు.

# ఘనంగా ముత్యాలమ్మ తల్లి బోనాలు

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని లాలాపురం గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ తల్లి బోనాల ఉత్సవాలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవంలో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావం నుంచి ప్రజలకు విముక్తి కలగాలని, సంవృద్ధిగా వర్షాలు కురిసి పంటల సాగుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతులు సుభిక్షంగా ఉండాలని ముత్యాలమ్మ తల్లిని, బొడ్రాయిని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. గ్రామ ప్రజలందరికి ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు కలగాలని అమ్మవారిని వేడుకున్నారు.



## అధికారులు సకాలంలో హాజరు కావాలి

**ప్రజాపక్షం/భద్రాచలం:** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కొనసాగుతున్న ప్రజావాణి గిరిజన దర్బార్ కార్యక్రమాలకు సంబంధిత శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఐటిడిఏ పిఓపి రాహుల్ ఆదేశించారు. అధికారులపై నమ్మకంతో ప్రజలు వ్యవ ప్రయాసలకు ఓర్చి ఇక్కడదాకా వచ్చి వినతులు సమర్పిస్తుంటారని వాటి పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని సూచించారు. పరిష్కారానికి నోచుకోని వాటిపై సకాలంలో సమగ్ర నివేదికలు అందించాలని ఆదేశించారు.

## ఘనంగా తీజ్ వేడుకలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని ఎనిమిదవ డివిజన్ బాలపేటలో తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన వేడుకలను బంజారా సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించారు. పూజలు నిర్వహిం చి ఆటపాటలు, నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు భూక్యా అశోక్ మాట్లాడుతూ ప్రకృతిని ఆరాదిస్తూ సోదర భావాన్ని చాటే తీజ్ పండుగ బంజారాల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. గిరిజనుల ఆచారాలు, సంస్కృతి ఎంతో గొప్పవని వాటిని భావితరాలకు అందించాలన్నారు.ఈ వేడుకల్లో నాయకులు అజ్మీర వెంకన్న, డా॥ భూపతి, నవీన్, ఆకాష్, రాము, స్థానికులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నాచారం వెంకటేశ్వరస్వామి దేవాలయ ఈవోగా రామారావు



**ప్రజాపక్షం/ఏన్కూరు:** మండల పరిధిలోని నాచారం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ నూతన ఈవోగా ఉడతనేని రామారావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఆయనకు గ్రేడ్ 2 ఈవోగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా నాచారం ఈవో ఎస్‌విడి ప్రసాద్, దేవస్థానం సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తానన్నారు. దేవాలయ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసచార్యులు, సత్యనారాయణచార్యులు, సిబ్బంది గోపాలరావు, వర్షా నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ ఫణితి సైదులు దంపతులు





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 7వ వార్డుకు చెందిన ఆకుల దుర్గారావు, ఆకుల రాము సోదరులు నూతనంగా నిర్మించుకున్న గృహాల గృహ ప్రవేశ కార్యక్రమానికి 7వ వార్డు కౌన్సిలర్ ఫణితి సైదులు ఉషా దంపతులు కుటుంబ సమేతంగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన గృహాలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ఆనందానికి నిలయాలుగా మారాలని ఆకాంక్షించారు. ఆకుల దుర్గారావు, ఆకుల రాము, వారి కుటుంబ సభ్యులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని మన స్ఫూర్తిగా కోరుతూ హృదయపూర్వక నూతన గృహ ప్రవేశ శుభాకాంక్షలు కౌన్సిలర్ ఫణిది సైదులు ఉషా దంపతులు తెలిపారు.

## ఆదివాసి రాజ్యాంగ హక్కులు, సంస్కృతి రక్షించుకోవాలి



**ప్రజాపక్షం/కరకగూడెం:** ఆదివాసి రాజ్యాంగ హక్కులు మరియు సంస్కృతి రక్షించుకోవాలని మాజీ ఎమ్మెల్యే మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షులు డాక్టర్ చందా లింగయ్య దొర తో పాటు ఆదివాసి గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు గొగ్గల ఆర్కే దొర ప్రధాన కార్యదర్శి కొమరం శ్రీను పిలుపునిచ్చారు. ఆదివారం కరకగూడెం మండల స్థాయిలో ఆదివాసి రాజ్యాంగ హక్కులు మరియు సమన్వయ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గొగ్గల కృష్ణ అధ్యక్షతన చిరుమల్ల గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ఆదివాసి రాజ్యాంగ హక్కులు మరియు సంస్కృతి రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ ,ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువకులు ,విద్యార్థులు హాజరై సభను విజయవంతం చేశారు.